ప్రజాశక్తి

ఆదివారం 21 మే 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

22న స్నాతకోత్సవ వేడుకలు

- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- 993 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం
- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడి

మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల

హరిత విప్లవంలో అగ్రగామిగా విరాజిల్లుతున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకలు ఈ నెల 22న బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఉపకులపతి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారుం. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 993 మంది విద్యార్థులకు ఈ స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. భారతదేశంలోని 74 విశ్వవిద్యాలయాల్లో ఈ యూనివర్సిటీ టాప్ టెన్ దిశగా తన స్థాయిని పదిలపరుచుకుందన్నారు. భవిష్యత్తులో ఈ విశ్వవిద్యాలయం ప్రథమ స్థానంలో నిలిపేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. తొలిసారిగా ఈ కళాశాలలో స్నాతకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారని తెలిపారు. ఇక్కడ రూపొందించిన బీపీటీ వరి వంగడం ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడించిందన్నారు. వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, ఆహార విజ్ఞాన ▶ 2లో

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

- సహకార ఆస్తులను ధారాదత్తం చేసే ఆలోచన విరమించుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని, అమూల్ సంస్థకు సహకార ఆస్తులను ధారాదత్తం చేసే ఆలోచనను విరమించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక హెూటల్ కళ్యాణి కాన్ఫరెన్స్ హాలులో అఖిల భారత రైతు పోరాట సమన్వయ సమితి(ఏఐకెఎస్‌సిసి), ప్రకాశం జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కిలారి రాజన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ధాన్యం కొనుగోలు కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాడి పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి ఆదాయం చేకూరుతున్నా రైతులకు తగిన మద్దతు ధర లభించటం లేదన్నారు. చిత్తూరు, ఒంగోలు డెయిరీలకు మంచి పేరు ఉందని, ఇక్కడ ▶ 2లో

చాకిరీ ఎక్కువ..కూలి తక్కువ.!

- ఉపాధి కూలీల దయనీయ పరిస్థితులు
- మండుటెండల్లోనే తవ్వకాలు.. చెట్లు తొలగింపు..
- వడదెబ్బకు ఇప్పటికే ఇద్దరు కూలీలు మృత్యువాత
- పని ప్రదేశాల్లో సౌకర్యాలను ఎత్తేసిన ప్రభుత్వాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

చేతుల్లో నీళ్ల బాటిళ్లు.. తలకు గుడ్డలు తీసుకుని ఉదయాన్నే ఆరు గంటలకే పరుగులు తీస్తున్నారు. రెండు కిలోమీటర్లు వరకూ కాలినడకనే పని ప్రదేశానికి వెళుతున్నారు. పనిలోకి దిగిన కొద్ది సేపటికే ఒళ్లంతా చెమటలు.. ఒంటి మీద వేసుకున్న దుస్తులు తడిచిముద్దవుతాయి. దాహార్తితో నీళ్ల బాటిళ్లు ఖాళీ అవుతాయి. తర్వాత దప్పికేసినా నీళ్లు కనపడవు. ఇలా సుమారు నాలుగు గంటల పాటు పనిచేస్తే చేతికి వచ్చేది రూ.200. చాకిరి ఎక్కువ.. కూలి తక్కువంటూ ఉపాధి కూలీలు వాపోతున్నారు.

టంగుటూరు మండలం, కందులూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు శనివారం ఉదయం వ్యవసాయకార్మిక సంఘం నేతలు కంకణాల ఆంజనేయులు, మోజెస్ వెళ్లి వారి వేసవిలో వాళ్లు పడుతున్న కష్టాలను పరిశీలించారు. సాగర్ కాలువలో ఉన్న చిల్ల చెట్లను కొడుతూ కొందరు.. పూడిక పనులు చేస్తూ కొందరు ఉన్నారు. అందరూ ఎండలకు తల్లడిల్లిపోతున్నారు. 9 గంటల్లోపే వాళ్ల ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్ల డబ్బాలన్నీ ఖాళీ అయ్యాయి. తాగడానికి నీళ్లు కూడా అందుబాటులో లేవు. ప్రభుత్వం లెక్క ప్రకారం ఒక క్యూబిక్ మీటరుకు రూ.272 ఇస్తోంది. అయితే ఇంత పని ఎవరూ చేయలేరని కూలీలు వాపోతున్నారు. కనీసం ముగ్గురు ▶ 2లో

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బాటిళ్లలో తెచ్చుకున్న మంచినీళ్లు అయిపోయాయని ఖాళీ బాటిళ్లు చూపిస్తున్న మహిళా కూలీలు

రాధ హత్య కేసులో మలుపులు..

పోలీసుల అదుపులో భర్త.?

పలు కోణాల్లో విచారిస్తున్న వైనం

భర్త, పిల్లలతో రాధ (ఫైల్)

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఈ నెల 17న జరిగిన వెలిగండ్ల మండలం, జిల్లెలపాడుకు చెందిన కోటా రాధ హత్య కేసు మలుపులు తిరుగుతోంది. ఇప్పటివరకు ఆమె వద్ద అప్పు తీసుకున్న స్నేహితుడే ఆమెను హత్య చేసి ఉండొచ్చని అందరూ భావిస్తుండగా.. తాజాగా పోలీసులు ఆమె భర్త మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించడం గమనార్హం. పోలీసులు ఈ కేసును సీరియస్‌ను తీసుకొని.. అన్ని కోణాల్లో విచారణ వేగవంతం చేశారు. మృతురాలి ఫోన్ కాల్‌డేటాను పోలీసులు పరిశీలించారు. ఆమె భర్త మోహన్‌రెడ్డిని కూడా అనుమానితుడిగా భావించి.. పలు కోణాల్లో విచారణ ▶ 2లో

"వివాహం అన్ని విషయములలో ఘనమైనది. హెబ్రి 13:4

పోట్లూరి వారి వివాహ వేడుక

మా ఏకైక పుత్రుడు చి॥ విల్సన్ కు చి॥సౌ॥ విజయ పావని తో
తే 21-05-2023 ఆదివారం సాయంత్రం 6-30 గంటలకు ప్రకాశం జిల్లా సింగరాయకొండలో
నిష్కళంక మేరీమాత దేవాలయం(ఆర్‌సిఎం చర్చి)లో ముహూర్తం నిర్ణయించడమైనది

విన్నపము: జ్ఞాన వివాహం దేవుని ఆశీర్వాదంతో జీవిత పాలిభాగస్తులుగా జతచేయబడుదురు. కావున తామెల్లరూ విచ్చేసి వధూవరులను ఆశీర్వదించ ప్రార్థన

విందు : రాత్రి 7 గంటలకు చర్చి ప్రాంగణం నందు

నిర్వాహకులు
రెవ. ఫాదర్. ఇల్లూరి హృదయ రాజ్ (సింగరాయకొండ విచారణ గురువులు)
రెవ. ఫాదర్. డి.ఎస్.పాల్ (ఒంగోలు విచారణ గురువులు)
రెవ. ఫాదర్. వైఎ విలియం జార్జ్ (నెల్లూరు కెథడ్రిల్ విచారణ గురువులు)
రెవ. ఫాదర్. ఫ్రాన్సిస్, హెచ్.జి.ఎన్. గురువులచే...

ఆహ్వానించు వారు...
పోట్లూరి ఇన్నయ్య (లక్ష్మయ్య) - శ్రీమతి సుజాత
DVMC మెంబర్, ప్రకాశం జిల్లా. ఎపిఎస్‌ఆర్‌టిసి
మరియు బంధుమిత్రులు, సింగరాయకొండ - ప్రకాశం జిల్లా.

చాకిరీ ఎక్కువ..కూలి తక్కువ.!

(మొదటిపేజీ తరువాయి)

మనుషులు పనిచేస్తేనే ఆ లెక్క ప్రకారం జరుగుతుందే తప్ప ఒక్కరి వల్ల కాదని నాగేశ్వరరావు అనే పెద్దాయన చెబుతున్నారు. దీంతో ఒక్కొక్కరికి రోజుకు రూ.200 కూడా రావడం లేదని బాలస్వామి, సుందరరావు తెలిపారు. ఇక్కడ సుమారు 130 మందికి పైగా పూడికతీతల పనుల్లో ఉన్నారు. ఉదయం 6 గంటలకు వచ్చి 10 గంటల వరకూ చేస్తున్నారు. నాలుగు గంటల పాటు చెమటోడ్చినా తగిన వేతనాలు రావడం లేదని అందరూ వాపోతున్నారు. చెట్లు కొట్టడం, పూడికలు తీయడం వంటి పనులు చేస్తున్నారు. ఇవి కష్టంతో కూడినందున ఎక్కువ పనిచేయలేకపోతున్నారు. వృద్ధులు, మధ్యవయస్సున్న వారూ, కొద్దిమంది మాత్రమే యువకులు కూలీలుగా ఉన్నారు. కొందరు మహిళలు మధ్యాహ్నం వరకూ మిరపకోతలకు వెళుతున్నారు. ఆ పనులకు పోతే ఏరోజుకారోజు రూ.300 ఇస్తున్నారు. ఇదే ఉపాధి పనులకు పోతే మూడు వారాలకొకసారి ఇస్తున్నారు. ఇది కూడా రూ.200 లోపే వేతనం వస్తోంది. చేసిన పనిని బట్టి ఇస్తారు. దీంతో వ్యవసాయ పనులుంటే వాటికే మహిళలు పోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎండలో పనిచేయలేని వాళ్లు మాత్రం ఉపాధి పనులకు వస్తున్నారు.

కనీస సౌకర్యాలకు మంగళం..

పనిచేసే ప్రాంతాల్లో కూలీలకు కొన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి చట్టంలోనే ఉంది. కూలీలకు తాగునీరు అందించాలి. ఎండలో పనులు చేసే సమయంలో కొద్ది సేపు విశ్రాంతి కోసం టెంట్లు వేయాలి. వడదెబ్బలు వంటి సమస్యలు ఎదురైనప్పుడు మందుల కిట్లు ఉండాలి. మజ్జిగ ఇవ్వాలి. అయితే వీటిని పూర్తిగా ఎత్తేశారు. ఇంటి నుంచే కూలీలు ఒక బాటిల్ తెచ్చుకుంటున్నారు. అవి అయిపోయాక చేసేదేమీ లేదు. ఎవరినీళ్లు వాళ్లకే చాలడం లేదు. ఊరికి దూరంగా పనులు చేస్తుంటారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

మూడు వారాలకోసారి వేతనాలు..

కూలీలకు రెండు వారాలకు ఒకసారి వేతనాలు ఇవ్వాలి. ఇప్పుడు మూడు వారాలకోసారి ఇస్తున్నారని కూలీలు చెప్పారు. ఎవరికి ఎంత వేస్తున్నారో కూడా స్పష్టంగా చెప్పడం లేదంటున్నారు. అయితే ఏ పనులు లేనందున వీటిని చేస్తున్నామని కూలీలు చెబుతున్నారు. అయితే వేతనాలు పెంచాలని, కనీసం రూ.300 వచ్చేలా చూడాలని అందరూ కోరారు.

ఉపాధి చట్టాన్ని కాపాడుకోవాలి
వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసేందుకు కేంద్రం ఆలోచిస్తోందని, పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. కందులూరులో పనులు చేస్తున్న కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. కూలీలు ఐక్యంగా నిలబడితేనే ఇది సాధ్యమవుతుందన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ఫలితంగానే ఈ చట్టం వచ్చిందన్నారు. ఒక్కో కుటుంబానికి రోజుకు రూ.600 కూలి వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీన్ని కాపాడుకునేందుకు ఢిల్లీ వెళ్లి ఆందోళనలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సంఘం స్థానిక నాయకులు మోజెస్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

ప్రకాశంజిల్లా కనిగిరి పట్టణానికి చెందిన చప్పరపు వీరవెంకట నాగసాయి చంద్ర తండ్రి చప్పరపు వెంకట శ్రీనివాసులుకు చెందిన ఆర్ 7880903 అనునెంబరు గలిగిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఒంగోలు నుంచి కనిగిరికి బస్‌లో వస్తుండగా పోయినది. కావున ఎవరికైనా దొరికినచో క్రింది చిరునామాకు తెలియజేయగలరు

ఇట్లు
చప్పరపు వీరవెంకట నాగ సాయిచంద్ర
తండ్రి చప్పరపు వెంకట శ్రీనివాసులు
8-179, ఎంఎస్‌ఆర్ రోడ్,
విశ్వోదయ నర్సింగ్‌హోమ్
కనిగిరి, ప్రకాశంజిల్లా,
ఫోన్‌నెం : 8332903165

మాట్లాడుతున్న చింతా శ్రీధర్

వెల్లలచెరువు పిఎసిఎస్‌లో
నానో డిఏపి ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంతమాగులూరు

నానో డిఏపి ప్రతికూల వాతావరణానికి సైతం తట్టుకొని విత్తనాల అంకురోత్పత్తి శాతాన్ని పెంచడంలో తోడ్పడుతుందని వెల్లల చెరువు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు చింతా శ్రీధర్ తెలిపారు. శనివారం మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణ లో, రైతుల సమక్షంలో నానో డిఏపిని ఆవిష్కరించారు. ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ డేనియల్ మాట్లాడుతూ నానో డిఏపిని అన్ని పంటలపై ఉపయోగించ వచ్చన్నారు. భారత ప్రభుత్వం ద్వారా ఆమోదించబడ్డ మొట్టమొదటి నానో డిఏపి ఎకరాకు 500 ఎంఎల్ ఉపయోగించ వచ్చన్నారు. దీని ధర రూ.600 మాత్రమే అన్నారు. నీటిలో కరిగే ఎరువులు, కొన్ని రకాల పురుగు మందులతోనైనా కలిపి వాడుకోవచ్చ న్నారు.

ఈ కార్యక్రమంలో ఇఫ్కో స్టేట్ మేనేజర్ టి శ్రీధర్‌రెడ్డి, సీఈఓ ఆంజనేయులు, చింతా రామారావు, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

లభించే నెయ్యికి డిమాండ్ అధికంగా ఉందన్నారు. సంగం డెయిరీలో అనేక సంస్కరణలు చేపట్టి నష్టాల నుంచి లాభాలలోకి తెచ్చామన్నారు. సహకార చట్టంలో చేరిన మొదటి డెయిరీ సంగం డెయిరీ అని తెలిపారు. నష్టాల పేరుతో సహకార డెయిరీలను ఫెడరేషన్ అధికారులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు డెయిరీని సైతం ఫెడరేషన్ అధికారులు నాశనం చేశారని, డెయిరీలలో రాజకీయ జోక్యం పెరగటం సరికాదన్నారు. అమూల్ సంస్థకు సహకార ఆస్తులను ధారాదత్తం చేయటం సరికాదని, ఆస్తులను పాడి రైతులకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాతలు నానా ఇబ్బందులు పడుతున్నారని, పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర లభించటం లేదన్నారు. పాడి పరిశ్రమపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని, పాడి రైతులను ప్రోత్సహించాలన్నారు. సహకార డెయిరీలు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. సహకార డెయిరీలను అన్ని విధాల అభివృద్ధి చేయాలన్నారు. అమూల్ డెయిరీ కంటే రైతులకు అధిక ధర ఇస్తున్న విజయ డెయిరీని అభివృద్ధి చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ ఒంగోలు డెయిరీని సహకార చట్టంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఒంగోలు డెయిరీలో రాజకీయ జోక్యం, అధికారుల పనితీరు కారణంగా డెయిరీ చరిత్ర మసకబారుతోం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలు డెయిరీని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాని కోరారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి హనుమారెడ్డి, పరిటాల కోటేశ్వరరావు, రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో భర్త.?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. నిందితుడు ఇతర సెల్‌నెంబర్ల ద్వారా రాధ సెల్‌కు మెసేజ్‌లు పంపి.. హత్యకు పగడ్బందీగా పథకం వేసి హతమార్చినట్లు తెలుస్తోంది. సిసి కెమెరాల ఫుటేజ్‌ల ఆధారంగా ఒక కారు రాధను వెంబడించి.. తర్వాత ఆమెను కారులో ఎక్కించుకొని వెళ్లి.. హతమార్చినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఆమె స్నేహితుడి బంధువులను కూడా పోలీసులు విచారించారు. అనంతరం రాధ భర్త మోహన్‌రెడ్డిపై కూడా అనుమానంతో విచారిస్తున్నారు. ఈ హత్య ఒకరే చేశారా.. టీమ్‌గా చేశారా.. అన్న కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

22న స్నాతకోత్సవ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలలతో పాటు వరి పరిశోధన స్థానం, ఉప్పు నీటి పరిశోధన స్థానం, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ వంటి అనేక పరిశోధన స్థానాలకు బాపట్ల జిల్లా కేంద్ర బిందువుగా ఉందన్నారు. 1945 లో ఏర్పాటైన బాపట్ల వ్యవసాయ కళాశాల 78 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుందన్నారు. దక్షిణ భారతదేశంలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు తర్వాత ఏర్పాటైన తొలి కళాశాల ఇదన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి. రామారావు, డిన్‌ఆఫ్ అగ్రికల్చర్ డి. సుధాకర్, ఆచార్యులు సిహెచ్ చిరంజీవి, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపట్ల ప్యాడిసన్ పేటలో జగనన్న పక్కా గృహాల లే అవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

జగనన్న కాలనీలలో
మౌలిక వసతులు కల్పించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని, పక్కాగహాల నిర్మాణా లు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి రంజిత్‌బాషా ఆదేశించారు. బాపట్లలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ లేఅవుట్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. పేదల పక్కా గృహ నిర్మాణాలకు అవసరమైన ఇనుము, ఇసుక, సిమెంట్ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. జగనన్న కాలనీలలో రహదారులు వేగంగా నిర్మించాలన్నారు. ముఖ్యంగా నీటి వనరులను సమకూర్చాలన్నారు. ప్యాడిసన్ పేటలో 1,746 మంది లబ్ధిదారులకు గహాలు మంజూరు చేయగా ప్రస్తుతం 615 గహ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. 54 గహాలు స్లాబ్ దశకు రాగా, 167 భవనాలు రూఫ్ దశలో ఉన్నవి స్లాబ్ వేసేలా చూడాలన్నారు. మరో 704 గహాలు పునాది దశలో నిర్మాణాలు జరుగుతుంటే వాటిని రూఫ్ దశకు చేరేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే 206 గహాలు పునాదికి దిగువన ఉన్నాయని, వాటి నిర్మాణాలు మొదలయ్యేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. గహ నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు తమ గహాలు నిర్వహించుకునేలా రుణ సదుపాయం వారికి కల్పించాలన్నారు. అవసరమైతే ఆయా గహాలకు మేస్త్రీలను జతచేసి అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అలసత్వం వీడి చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ మందలించారు. తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పురోగతి సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని పలు సూచనలు చేశారు. బాపట్ల ఆర్డీవో జి.రవిందర్, గహ నిర్మాణశాఖ పిడి ప్రసాద్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-బాపట్ల

హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని మట్టి కరిపించి కాంగ్రెస్ విజయం సాధించి సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనున్న నేపథ్యంలో బాపట్లలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శనివారం పట్టణంలో అంజుమన్ కాంప్లెక్స్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాపట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంట అంజిబాబు సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సిద్ధరామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ బిజెపి పార్టీ కేవలం మతాన్ని నమ్ముకుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి ప్రజల సంక్షేమం కోసం పంచ సూత్రాల పథకాలు, మతసామరస్యం మాత్ర మే ఏ జెండాగా పనిచేసి విజయం సాధించిందన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న సందర్భంగా బాపట్ల కాంగ్రెస్ పార్టీ తరఫున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శీలం సాగర్, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, ధోనేపూడి రవి, నళిని, ముత్తయ్య, తాజుద్దీన్, యాసీన్, అబ్దుల్ సుభాని, ఎస్‌కే షఫీ, షేక్ గౌస్ బాషా, షేక్ రబ్బానీ పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి సింగరాయకొండ

సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శింగరాయకొండలోని శాంతి థియేటర్ వద్ద నందమూరి తారక రామారావు జన్మదిన వేడుకలను ఫ్యాన్స్ అధ్యక్షులు కల్లగుంట నరసింహ, బాపట్ల సురేష్, దేపూరి కొండలరావు ఆధ్వర్యంలో జరిగాయి. బాణసంచా పేల్చారు. కేకును కట్ చేసి పంచిపెట్టారు.

రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తత

మోహరించిన పోలీసు బలగాలు ● గాయపడిన రామాపురం గ్రామ పెద్దలు అంకయ్య, వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలోని తీర ప్రాంతంలో మళ్లీ అలజడి రేగింది. రామాపురం, కటారిపాలెం రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు రెండు గ్రామాలలో పోలీసు బలగాలను మోహరించే ఉన్నారు. ఈ సంఘటన శనివారం తీర ప్రాంత గ్రామాలలో అలజడి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు తీర ప్రాంత 103 గ్రామాల మత్స్యకార పెద్దలు కటారిపాలెంలో రెండు గ్రామాల పెద్దలతో సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో రామాపురం గ్రామాన్ని తమ సామాజికవర్గంలో కలుపుకోవాలని ప్రతిపాదించారు. గత నాలుగేళ్ల క్రితం నుంచి ఈ రెండు గ్రామాల మధ్య రాజకీయ వైరుధ్యం ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన చర్చలలో రామాపురం గ్రామానికి చెందిన కాటం గారి అంకయ్య, వాయిల వెంకటేశ్వర్లుపై కటారిపాలెం గ్రామస్తులు దాడికి దిగారు. ఈ దాడిలో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అంకయ్య, వెంకటేశ్వర్లు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కటారిపాలెం రామాపురం గ్రామాలలో పెద్దలతో సమావేశం అయ్యారు. కటారిపాలెం గ్రామస్తులు రామాపురం ఊరిపై దాడి చేయాల్సిందే అంటూ భీష్మించుక్కూర్చున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు జిల్లా కేంద్రంలో సమాచారం అందించి అదనపు పోలీసు బలగాలను రప్పించారు. రెండు గ్రామాలలో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. 13 గ్రామాల పెద్దలు మాత్రం రెండు గ్రామాలలో శాంతి వాతావరణం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. చీరాల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని రూరల్ సీఐ మల్లికార్జునరావు వేటపాలెం ఎస్సై జి సురేష్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మాత్రం పాత్రికేయుల ఫోన్లను ఎత్తకపోవడం గమనర్హం ఏది ఏమైనా గత నాలుగేళ్ల నుంచి రెండు గ్రామాల మధ్య రాజకీయ నాయకుల అండ దండలతో పాత కక్షలు నివురు గప్పిన నిప్పులా మారాయి. ఈ ఉద్రిక్తత ఇదే విధంగా కొనసాగితే తీర ప్రాంత గ్రామాలలో లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం తలెత్తే అవకాశం ఎంతైనా ఉన్నదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పోలీస్ ఉన్నతాధికారులు రెండు గ్రామాల మధ్య సామరస్య వాతావరణం నెలకొల్పే విధంగా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న పెద్దలు

మోహరించిన పోలీసులు

పోస్టరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మనఊరు-మన ఎంఎల్ఏ పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మన ఊరు-మన ఎంఎల్ఏ గోడ పోస్టర్‌ను శనివారం మద్దిరాలపాడులో మండల వైసిపి కార్యాలయం ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. శివాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో గ్రామాలలో జరిగిన సంక్షేమం అభివృద్ధిని చర్చించుకోవటంతో పాటుగా రాబోయే 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా టీజేఆర్ సుధాకర్‌బాబును మరోమారు గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి నల్లమలపు కృష్ణారెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ కొలకలూరి విజయకుమార్, వైస్ ఎంపీపీ మల్లెల జాన్సన్, మండల ఎస్‌సి సెల్ నాయకులు పూజల చంద్రయ్య, ఏరిచర్ల యోహాను, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండు వెంకటరావు, కాట్రగడ్డ శ్రీను, రామస్వామి, హరిబాబు ఎంపిటిసి సభ్యులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి: సిఐ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని బాపట్ల అర్బన్ సీఐ కృష్ణయ్య అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం నో యాక్సిడెంట్ డే సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో ఆటో డ్రైవర్లు ఆటోలో అధిక సౌండ్‌తో పాటలు పెట్టడంతో ఆ స్పీకర్లను స్వాధీనం చేసుకొని ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలుంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా బాడుగకు వెళ్లే డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. క్షేమంగా గమ్యం చేరేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, సిఐ కే ప్రభాకర్ తెలిపారు. శనివారం నో యాక్సిడెంట్‌డే సందర్భంగా, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కొమ్మాలపాడు, ఏల్చూరు, పుట్టావారిపాలెం జంక్షన్, సంత మాగులూరు గ్రామాల జంక్షన్‌లలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారికి, మరియు వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు లేని వారికి, రాంగ్ రోడ్డుపై వాహనాలు నడిపే వారికి, ఈ చలానా విధించి వారి చేత కట్టించినట్లు తెలిపారు. అదేవిధంగా రహదారులపై యాక్సిడెంట్ జరగకుండా ఉండటానికి డ్రమ్స్ ఏర్పాటు చేశారు. ఆ డ్రమ్స్‌పై రాత్రులందు కనపడటానికి రేడియం స్టిక్కరింగ్ కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా మహిళా పోలీసుల సహాయంతో కొమ్మాలపాడు గ్రామంలో ఉన్న మహిళలకు ప్రతి ఒక్కరికి దిశా యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టణ సిఐ పి కృష్ణయ్య

కౌన్సెలింగ్ ఇస్తు సిఐ ప్రభాకర్

స్ఫూర్తి ప్రదాత టంగుటూరి ప్రకాశం పంతులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత అని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. ప్రకాశం పంతులు 66వ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన వినోదరాయుని పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు బివిఎస్‌పిఎం డిగ్రీ కాలేజి కరస్పాండెంట్ బైరపనేని సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత విశేషాలు వివరించారు. చిన్నతనంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందారన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన దీరోదాత్తుడని కొనియాడారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా తన సొంత మండలమైన నిడమానూరుకు దగ్గరగా రావడం ఆనందంగా ఉందన్నారు. తద్వారా 50 సంవత్సరాలపాటు చెప్పుకొనే విధంగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రిజస్ట్రారు బి హరిబాబు మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పరిచయం అవసరం లేని వ్యక్తి టంగుటూరి అన్నారు. లాయర్‌గా, ముఖ్యమంత్రిగా పనిచేసి తనకంటూ ఏమీ మిగిల్చుకోని మహోన్నత వ్యక్తి అన్నారు. తొలుత గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులను గ్రామస్తులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఘట్టమనేని అశోక్‌బాబు, విజయభారతి బిఇడి కాలేజి, ఒంగోలు కరస్పాండెంట్ ఉన్నం చంద్రరావు, ఆర్కైజాలిస్ట్ జ్యోతి చంద్రమౌళి, వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

క్రికెట్ ఆడుతున్న దృశ్యం

ఉత్కంఠ భరితంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మద్దిరాలపాడులో పాలడుగు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాక్ బాల్ ఆహ్వాన క్రికెట్ పోటీలు ఐదవ రోజైన శనివారం ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఒంగోలు, బాపట్ల టీములు తలపడగా ఒంగోలు టీము విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాలడుగు రాజీవ్ మౌనిక దంపతులు, సందీప్, అతిథులు పెనుబోతు గణేష్ బాబు, దాచర్ల తిరుమలరావు, ఆచంట శ్రీరామ్, పాలడగు వెంకయ్య, వెంకట్రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

వివరాలు వెల్లడించిన డిఎస్‌పి వెంకటేశులు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం చెరువు ఉప్పరపాలెం గ్రామంలో ఈ నెల 19 జరిగిన దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం బాపట్ల డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగతనం వివరాలను డిఎస్పి టి వెంకటేశులు వెల్లడించారు. డిఎస్‌పి తెలిపిన వివరాలు ప్రకారం గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన చిల్లర సురేష్, పెదనందిపాడు గ్రామపంచాయతీ పరిధిలో మాలపల్లికి చెందిన పి కిరణ్ బాబు ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, చిలకలూరిపేట, బాపట్ల రూరల్ పరిధిలోని గ్రామాల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. బాపట్ల రూరల్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి గుంటూరు కీర్తన గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టిన 90 గ్రాములు బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదు, వెండి వస్తువులు, ఎపిటిఎఫ్07బిఎఫ్2332 నెంబర్ గల స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించి నిందితులను అదుపులో తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వి శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శివయ్య, ఎన్ వేణుబాబు, డిటి వెంకటేశ్వరరెడ్డిలను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో బాపట్ల రూరల్ సిఐ వేణుగోపాలరెడ్డి, రూరల్ ఎస్ఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సురేష్

ప్రయాణికులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-చిన్నగంజాం

వాహనదారులు మోటార్ వాహనాలు చట్టం గురించి తెలుసుకోవాలని రోడ్డు నియమాలు పాటించాలని ఎస్ఐ కే సురేష్ అన్నారు. శనివారం నేషనల్ హైవే 2016లో బ్లాక్ స్పాట్ వద్ద నో యాక్సిడెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, నియమిత వేగంతో ప్రయాణం చేయాలని ఆయన సూచనలు చేశారు. అదేవిధంగా వాహన చట్టాన్ని ఉల్లంఘించిన వాహనదారులపై 35 కేసులు నమోదు చేసి రూ.6,200 జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న పెంట్యాల హనుమంతరావు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు అధ్యక్షులు బొడపాటి రాఘవరావు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి పి ఆదిశేషు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు కనుబద్ది కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని రైతు సంఘం జిల్లా నాయకుడు పెంట్యాల హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాతలు కనుబద్ది శ్రీనివాసరెడ్డి, కనుబద్ది చెన్నారెడ్డి, కనుబద్ది బ్రహ్మారెడ్డి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు గంగాడి నాగేశ్వర రావు, జి లింగయ్య, ఎస్ హనుమంతరావు, మదిర ఆదినారాయణ, ముచ్చు వెంకటరావు, ఆర్‌టిసి టి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దిపాడు గ్రంథాలయంలో చదువుకుంటున్న చిన్నారులు

చదువుతో జ్ఞాపకశక్తి

ప్రజాశక్తి-మద్దిపాడు

చదవడం వలన జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చునని విశ్రాంత ఉపాధ్యాయుడు బి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా శనివారం చదవడం ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు పివిఎల్ వసుంధరదేవి, చిన్నారులు పాల్గొన్నారు.

బాపట్లలోని అన్నా క్యాంటిన్‌లో పేదలకు అన్నం వడ్డిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో బాపట్లలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ విజయవంతంగా సాగుతోంది. ఈ క్యాంటిన్‌ను ప్రారంభించి శనివారానికి 202 రోజులు పూర్తయ్యాయి. శనివారం బాపట్లకు చెందిన జిట్టా శ్రీనివాసరావు తండ్రి జిట్టా తులసీ నారాయణ 90వ జయంతి, కుమార్తె సాయి చైతన్య పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో 300 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వేగేశన నరేంద్రవర్మ, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసన

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఢిల్లీలో మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా బాపట్లలో ర్యాలీ నిర్వహించారు. బాపట్ల పాత బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఢిల్లీలో రెజ్లర్లపై, మహిళ యోధులు మన దేశానికి ప్రపంచంలోనే బంగారు పతకాలు సాధించి పెడుతున్నటువంటి మహిళలపై బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు గురిచేశారు. దీనిపై మల్లయోధులు పోలీస్ కేసు కూడా ఢిల్లీలో పెట్టగా వారిని వారి కుటుంబ సభ్యులను బిజెపి ఎంపీ, వారి అనుయాయులు రెజ్లర్లపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. అంతేకాదు కేసును పక్కదారి పట్టించడానికి వారు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రకరకాల భౌతిక దాడులు కూడా చేయటానికి వెనకాడట్లేదు దీన్ని ఖండిస్తూ దేశవ్యాప్తంగా వామపక్షాలు, మహిళలు ట్రేడ్ యూనియన్ రంగాలవారు దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా శనివారం బాపట్ల సీఐటీయూ ఆధ్వర్యంలో పాత బస్టాండు నుంచి తవ్వకాల వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సుభాషిణి అధ్యక్షత వహించారు. సిఐటియు నాయకులు పాల్గొని బిజెపి ఎంపీని అరెస్టు చేసేవరకు ఈ నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరించారు. ఓ లక్ష్మణరావు, శామ్యూల్, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు రమేష్, రవి, రవి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బిజెపి ఎంపిని అరెస్టు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

మజ్జిగ లేదు.. మంచి నీళ్లు లేవు

పని ప్రదేశంలో ఉపాధి కూలీల ఇక్కట్లు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

కార్మికులు పోరాడి సాధించుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మండుటెండలో కూలీలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వేసవిలో ఇవ్వాల్సిన మజ్జిగ లేదు. మంచి నీళ్లు లేవు. ఉడికిపోతున్న ఉక్కలో కూడా ఉపాధి కూలీలు వడబడిపోతున్నారు. 47 డిగ్రీల ఎండలో కూడా కూలి కోసం పాట్లు తప్పటం లేదు. వ్యవసాయ ప్రాంతం కావటంతో పాటు ఈ ఏడాది అంతా అకాల వర్షాలతో నష్టం రావటంతో కూలీలంతా ఉపాధి పనులపైనే ఆధారపడి ఉన్నారు. ఇంకొల్లు మండల కేంద్రంలోని అక్కసానికుంటలో 250 మంది ఉపాధి కూలీలతో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. కేవలం 150 మంది కూలీలు మాత్రమే పనులకు హాజరై పని చేస్తున్నారు. పని చేసే కూలీలకు భద్రత కల్పించటంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీలకు న్యాయపరంగా రావాల్సిన హక్కులను కల్పించాలని కోరుతున్నారు.

ఇంకొల్లు అక్కసాని కుంటలో పూడిక తీస్తున్న కూలీలు

ఎండలో తప్పని తిప్పలు: రామకృష్ణ, కూలీ, ఇంకొల్లు

వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులు చేసేందుకు ముందుకు వచ్చాము. యువకులమైన మేము ఎండలో పని చేయలేక పోతున్నాము. పెద్దవారి పరిస్థితి చెప్పలేనిది. ఈ పని కూడా లేకపోతే మేము ఎలా బతకాలి. మాకు భద్రత కల్పించి, సౌకర్యాలు కల్పించాలి.

అధికారులతో సమీక్షిస్తున్న సిఇఒ మోహనరావు

గృహ నిర్మాణాలపై జడ్పీ సిఇఒ సమీక్ష

ప్రజాశక్తి-భట్టిప్రోలు

జగనన్న లే అవుట్‌లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జెడ్పి సిఇఓ జె మోహనరావు సూచించారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గృహ నిర్మాణ సిబ్బందితో సమీక్షించారు. గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి పనులు వేగవంతం అయ్యేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖర్, ఈఓపి ఏడి శేఖర్‌బాబు, హౌసింగ్ ఏఇ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు ప్రజలు మద్దతివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కే మాబు

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

ప్రజా పోరాటాలకు ప్రజలు మద్దతివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కే మాబు ప్రజలను కోరారు. మండలంలోని పేర్నమిట్ట శాంతినగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ప్రధాని మోడీని ఇంటికి సాగనంపితేనే దేశానికి, ప్రజలకు విముక్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేసిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోకరిల్లుతున్నాడని విమర్శించారు. రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు ఏ విధానాలు నచ్చాయో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపిని వ్యతిరేకించే ప్రభుత్వాలను సిబిఐ ఈడీల పేరుతో వారిపై దాడులు చేయిస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు. ప్రధాని మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కమ్యూనిస్టుల్ని శత్రువులుగా చిత్రీకరించేందుకు బిజెపి తీవ్ర ప్రయత్నం చేస్తుందని ఆయన చెప్పారు. వర్ణాశ్రమ ధర్మాలను అమలు చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న మాబు

కులాల మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు బిజెపి పెడుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మతాలని కులాలను చీల్చి చెండాడని ఆయన గుర్తు చేశారు. సుందరయ్య నాయకత్వాన తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా పది లక్షల ఎకరాలను పేదలకు భూములు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. సుందరయ్య మొట్టమొదటిగా వ్యవసాయ కార్మిక సంఘాన్ని తన గ్రామంలోనే ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కోవిడ్ కాలంలో ప్రజలకు అండగా నిలిచింది కమ్యునిస్టులేనని గుర్తు చేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఉబ్బా ఆదిలక్ష్మి మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందని అన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగాయని మహిళలకు రక్షణ కరువైందన్నారు. రాష్ట్రంలో జగన్ చంద్రబాబు పవన్ కల్యాణ్ ముగ్గురూ మోడీ భజన చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర సమస్యల గురున్చి ఆ ముగ్గురికి పట్టడం లేదన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు రాతికింద సుబ్బారావు మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగం చెయవద్దని హితవు పలికారు. ప్రజల పక్షాన నిలిచేది కమ్యునిస్టులేనన్నారు. సభకు ముందుగా సీపీఎం నాయకులు దగ్గుపాటి వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సభకు సీపీఎం నాయకులు అన్నా వెంకటసుబ్బారావు అధ్యక్షత వహించగా సీపీఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, తుళ్లూరి సుబ్బారావు, దాసరి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శ్రీ సిఎం యూనిట్లు బంద్

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి, బూదవాడ ప్రాంతాలలోని శ్రీసిఎం గ్రానైట్ కటింగ్ యూనిట్ల యజమానులు సోమవారం నుంచి కంటైనర్లు ఎత్తకుండా బంద్ చేస్తున్నట్లు యూనియన్ ప్రతినిధి ఎం.రామారావు తెలిపారు. మెటీరియల్ రేట్ విషయంలో యజమానులు సమస్యలు ఎదుర్కోంటున్నారని, రేటు విషయమై ఆదివారం యూనియన్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని, యజమానులు సకాలంలో రావాలని కోరారు. సమావేశంలో నిర్ణయించి జూన్ 1 నుంచి కేవలం సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకే యూనిట్లు నడిపే విధంగా నిర్ణయిస్తారన్నారు. వివరాలకు ఎం రామారావు ఫోన్ 9492538058 నెంబరుకు సంప్రదించాలన్నారు.

ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిఎం నారాయణశర్మ

మెరుగైన సేవలందించటమే లక్ష్యం

ఎస్‌బిఐ అమరావతి జిఎం నారాయణ శర్మ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటమే తమ లక్ష్యమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ తెలిపారు. స్థానిక దక్షిణ బైపాస్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన రిటైల్ ఎసెట్స్ సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌ను (ఆర్‌ఏసిపిసి) గుంటూరు జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటీ తో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓం నారాయణ శర్మ మాట్లాడుతూ ఆర్‌ఏసిపిసి కేంద్రం ఏర్పాటుతో రిటైల్ రుణాల మంజూరు వేగవంతమవుతుందన్నారు గృహ, వ్యక్తిగత, వాహన, విద్య రుణాలను ఈ కేంద్రం పరిశీలించి మంజూరు చేస్తుందన్నారు. దీంతో రుణాల మంజూరు వేగవంతం కావడంతో పాటు ఖాతాదారులకు రుణ సేవలు సేవలు మరింత సులభతరమవుతాయన్నారు. జిల్లాలోని అన్ని భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖలకు చెందిన రిటైల్ రుణాలకు సంబంధించిన దరఖాస్తులన్నింటిని ఈ ఆర్‌ఏసిపిసి సెంటర్ ప్రాసెస్ చేస్తుందన్నారు. విద్య రుణాలకు సంబంధించి 7.5 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా తమ బ్యాంకు అందజేస్తుందన్నారు. ఐఐటి, నిట్ వంటి సంస్థలలో సీటు వచ్చిన విద్యార్థులకు రూ.30 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా విద్యా రుణం అందజేస్తున్నామన్నారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు కోటిన్నర వరకు రుణం అందజేసే అవకాశం ఉందన్నారు. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న ఖాతాదారులకు వడ్డీలో రాయితీ కూడా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పిటి వెంకట్రావు, ఆర్‌ఏసిపిసి చీఫ్ మేనేజర్లు మాలకొండయ్య, రవికుమార్, చీఫ్ మేనేజర్లు పివిఎస్ ప్రసాద్, జవ్వాది రాజ్ కిరణ్, శ్రీనివాస రావు, పివి ప్రసాద్,హెచ్‌ఆర్ మేనేజర్ చంద్ర, పిబి చంద్రశేఖర్, వి. శ్రీనివాసరావు, వేణు బాబు, సునీల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని గొబ్బూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బుజ్జి బాయి ఆధ్వర్యంలో పచ్చిరొట్ట పంటల విత్తనాలు రైతులకు 50శాతం సబ్సిడీతో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదేవిధంగా మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్ర పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీతో అందజేయడం జరుగుతుందని, ఇప్పటి వరకు బుక్ చేసుకున్న రైతులకు తెప్పించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంకా ఎవరికైనా రైతులకు కావాలంటే రైతు భరోసా కేంద్ర సిబ్బంది దగ్గరికి వెళ్లి బుక్ చేసుకోవాలని, పచ్చి రొట్ట పంటలు విత్తనాలు రేట్లు జీలుగలు క్వింటా రూ.7,900 కాగా రూ.3,950లకు అందజేయడం జరుగుతుందన్నారు. జనుములు క్వింట రూ.8,400లు కాగా రూ.4200లకు, పిల్లిపెసర విత్తనాలు క్వింటా రూ.7,760 కాగా రూ.3,880లకు అందజేయడం జరుగుతుందన్నారు.

కార్మిక, కర్షక రాజ్యంతోనే

రైతుకు గిట్టుబాటు ధర సాధ్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్

ప్రజాశక్తి-చీమకుర్తి

రైతుకు గిట్టుబాటు ధర కావాలంటే కార్మిక, కర్షక రాజ్యంలోనే సాధ్యమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్ పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా కెవిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభకు బెజవాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎస్‌డి.హనీఫ్ మాట్లాడుతూ అభ్యుదయ భావాలతో సమాజం అన్ని రకాలుగా పురోగమించాలని సుందరయ్య కోరుకున్నారన్నారు. కష్టపడే కార్మికుడికి, వ్యవసాయ కార్మికుడికి గిట్టుబాటు కూలీ కావాలన్నా, రైతుకు గిట్టుబాటు ధర కావాలన్నా కార్మిక, కర్షక రాజ్యంతోనే సాధ్యమని నమ్మి.. చివరిదాకా పోరాడన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ సుందరయ్య నిస్వార్ధ రాజకీయాలకు నిదర్శనమన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు మాట్లాడుతూ ప్రజావైద్యశాల లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ నాయకులు పొత్తూరి సురేష్, కొల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య, దరిశి సుధాకర్, పమిడి రామారావు, ఇతర పార్టీల నాయకులు గోగినేని నరసింహారావు, పుట్టాశ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్

'ఉపాధి'కి కూలీలు రాకుండా చేసే కుట్ర

వ్యకాసం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కూలీలు కరువు పనులకు రాకుండా చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆరోపించారు. శనివారం మండలంలోని కందులూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ వేసవిలో రూ.100 పని చేస్తే రూ.30 సమ్మర్ అలవెన్స్‌ను ఇచ్చేవారన్నారు. మంచినీళ్లకు రూ.5, గడ్డపారకు రూ.15, తట్ట, పారకు రూ.5 ఇచ్చేవారని, ప్రస్తుతం వాటిని కూడా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఉపాధి పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కూడా కల్పించడం లేదని, దీనివల్ల ఉపాధి కూలీలు తీవ్రమైన ఎండలతో డి హైడ్రేషన్‌కు గురవుతున్నారని కూలీలు వ్యకాస నాయకుల ముందు వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం టంగుటూరు మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్ పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

త్వరలో 25 వేల ఇళ్లపట్టాలు పంపిణీ

- తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో అర్హులైన పేదలు 25 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం జరిగింది. సమావేశానికి ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్పొరేటర్ల ద్వారా వారి డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులు, జరుగుతున్న అభివృద్ధి పనులు జరగాల్సిన పనుల గురించి తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. వేసవి కాలం సందర్భంగా నీటి అవసరాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నీటి సరఫరా చేయాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో శానిటరీకి సంబంధించి పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అమృత్ పథకంలో మంజూరైన 339 కోట్ల రూపాయలకు సంబంధించి పనులను కూడా ప్రారంభిస్తామని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జి మేయర్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. సమావేశంలో ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

శాసనసభ స్పీకర్ తమ్మినేనికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు పెద్దదోర్నాల పట్టణంలో శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వైసిపి నాయకులు శాలువలు, పూలమాలలు వేసి పుష్పగుచ్చాలు అందజేశారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శ్రీశైలం వెళుతూ పెద్దదోర్నాల పట్టణంలో ఆగారు. ఈ సందర్భంగా ఆయనను ఘన స్వాగతం పలికారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు అతిథిగృహంలో కొద్దిసేపు మంత్రి సురేష్ కార్యకర్తలతో ముచ్చటించారు. అనంతరం టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు అమ్మిరెడ్డి రామిరెడ్డిచ గంటా గురువారెడ్డి, గుమ్మా యల్లేష్, అల్లు భూపాల్‌రెడ్డి, పవన్ కుమార్ తన్నీరు కిశోర్ కుమార్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేనికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఉచితంగా నేత్ర వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత నేత్ర వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారిలో 408 మంది వృద్ధులకు శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఉచిత నేత్ర వైద్యపరీక్షలను గుంటూరు శంకరనేత్రాలయం వైద్యులు అనీష్, నీరజ, రుతుజా నిర్వహించారు. అనంతరం వృద్ధులకు మందులను, కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరంలో క్యాంప్ ఇన్‌ఛార్జి సైదులు, టిడిపి నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న వరికూటి

వృద్ధులకు అండగా ప్రభుత్వం: వరికూటి

ప్రజాశక్తి-కొండపి

ప్రతి పేదవాడితో పాటు వృద్ధులకు అండగా వైసిపి ప్రభుత్వం ఉంటుందని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం నాడు మండలంలోని చినవెంకన్నపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి.. ప్రతి ఒక్కటీ అర్హులైన లబ్ధిదారులకు పార్టీలకతీతంగా అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వర్లు, చినవెంకన్నపాలెం నాయకులు పోటు శ్రీను, కట్టుబడిపాలెం నాయకులు గోవిందయ్య, రెండు గ్రామాల సర్పంచ్‌లు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-కొండపి

గ్రంథాలయంలో ఉండే పుస్తకాల ఆవశ్యకత గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొండపి గ్రంథపాలకుడు కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. శనివారం నాడు వేసవి విజ్ఞాన శిబిరం గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి 14 మంది విద్యార్థులు హాజరయ్యారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు చిన్నారులకు దేశనాయకుల జీవితచరిత్ర గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా దాసిరెడ్డిపాలెం హెచ్‌ఎం ఆంజనేయులు హాజరయ్యారు. గ్రంథాలయం ప్రాముఖ్యత, శిక్షణ శిబిరం ఉద్దేశ్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు.

పోటాపోటీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-దరిశి

స్థానిక ఎన్ఎస్‌పి కాలనీలో జిల్లాస్థాయి షార్ట్ పిచ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ పెద్దిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ క్రికెట్ టోర్నమెంటుకు మొత్తం 32 టీమ్‌లు పాల్గొన్నాయని ఆర్గనైజర్లు రామాంజి, మణి తెలిపారు. మొదటి బహుమతి దరిశి ఆరో వార్డు కౌన్సిలర్ పెద్దిరెడ్డి నారాయణరెడ్డి రూ.30,116, ద్వితీయ బహుమతి పాలకొలను పాపిరెడ్డి రూ.20,116, తృతీయ బహుమతి పెద్దిరెడ్డి నారాయణరెడ్డి రూ.10,116, మ్యాన్ ది సిరీస్ రూ.2,116 టి.రవిబాబు అందిస్తారని చెప్పారు.

మైక్ సెట్ అందజేత

ప్రజాశక్తి-దరిశి

తాళ్లూరు మండలం, తూర్పుగంగవరంలో యోగా క్లాసులు జరుగుతున్న సందర్భంగా యోగా గురూజీ శ్రీరామ్‌కు తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు అహూజా మైకు సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తాటికొండ శ్రీనివాసరావును అభినందించారు.

నిస్వార్థ ప్రజానాయకుడు సుందరయ్య

ప్రజాశక్తి-పిసిపల్లి

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. పీసీపల్లిలో సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంపాదనే లక్ష్యంగా నేడు రాజకీయాలు నడుస్తున్న దశలో తన యావదాస్తిని, జీవిత సర్వస్వాన్ని ప్రజల కోసం అంకితం చేసిన సుందరయ్య లాంటి మహోన్నత నేతలను స్మరించుకోవటం అత్యంత అవసరమన్నారు. ఒకసారి ప్రజా ప్రతినిధిగా గెలిస్తే తరతరాలకు అవసరమైన ఆస్తులను సంపాదించుకుంటున్న నేతలను మనం చూస్తున్నామని, తనకు బిడ్డలు ఉంటే వారికోసం సమయాన్ని, ఆస్తిని కేటాయించాల్సి వస్తుందని, బిడ్డల్నే వద్దనుకున్న నిస్వార్థజీవి సుందరయ్య అని అన్నారు. సభకు సిఐటియు నాయకులు పి.మహేష్ అధ్యక్షత వహించారు. సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, గుంటగాని ప్రేమ కుమార్, గుంటగాని పిచ్చయ్య, తాళ్ళూరి మోహన్, తాళ్ళూరి అవినాష్, అత్యాల ప్రకాశం, కొడవటిగంటి చిన్నయ్య, చంద్రశేఖర్, భాస్కర్, పి.రమేష్, గుంటగాని స్టీఫెన్, ఎనుబరి ఇజ్రాయెల్ పాల్గొన్నారు.

కంభం రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి శనివారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య చేసిన త్యాగాలను, పోరాటాలను గురించి కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు తోట తిరుపతిరావు, యుటిఎఫ్ కంభం మండల అధ్యక్షులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎంఎస్.బేగ్, సిపిఎం మండల నాయకులు ఎం.వెంకట్, బి.గాలయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు గుణశేఖర్, నందివర్ధన్, రంగనాథ్, నారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

పిసిపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కంభంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

'పల్నాటి వీరచరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక సి.వి.యన్.రీడింగ్ రూమ్ ఆవరణలో జాగృతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ధర్నాశి చిరంజీవి రచించిన "పల్నాటి వీరచరిత్ర" పుస్తకం ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి కళామిత్రమండలి జాతీయ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు సభా సంచాలకులుగా వ్యవరించారు.నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ సభకు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డా.జీ.వి.పూర్ణచందు, హైదరాబాద్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.జి.వి రత్నాకర్, డా.నూకతోటి రవికుమార్, సింహాద్రి జ్యోతిర్మయిల చేతుల మీదగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆనాటి కాలంలో పల్నాటి ప్రాంతాల్లో ఉన్న పరిస్థితుల గురించి ఈ పుస్తకం క్లుప్తంగా వివరిస్తుందని పెద్దలు వివరించారు.పుస్తకాన్ని గూర్చి గాదంశెట్టి శ్రీనివాస్ చక్కగా సమీక్షించారు. ఈ సందర్భంగా పల్నాటి వీరాచార విద్యావస్తు కిన్నెర సింహాద్రి చే వీరగాథను గానం చేయబడింది. సుస్మిత డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శనతో అలరించారు. తదనంతరం తేళ్ల అరుణ ,కిన్నెర సింహాద్రి ,జీ.వి.రత్నకర్ తదితరులను వీర పురస్కారాలతో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కవులు మార్తాటి ఈశ్వర గోపాలరావు, పిన్ని వెంకటేశ్వర్లు ,యు.వి.రత్నం, యన్.రాధికా రత్న, బి.రామారావు, మొగిలి దేవప్రసాద్ డి.యస్.పి శ్రీనివాసరావు ఇంకా ఈకార్యక్రమంలో కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జున్ రావు ,డా.సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పూర్ణచంద్రరావు

బుజ్జమ్మ మృతికి పూర్ణచంద్రరావు నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బత్తుల రాజగోపాల్‌రెడ్డి తల్లి బత్తుల బుజ్జమ్మ మృతిచెందారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు పాకలలోని బత్తుల రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట మందలపు గాంధీ చౌదరి, చీమకుర్తి కృష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మించల బ్రహ్మయ్య, ఇమ్మడిశెట్టి రామారావు, పులి ప్రసాద్, ఎస్‌కె.అబ్దుల్ సుభాన్, బాయిరెడ్డి, మురళి, నర్రా రాంబాబు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పామూరు

వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వైసిపి జిల్లా నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, పామూరు పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ యాదాల వెంకటసాయి కిరణ్ అన్నారు. శనివారం పామూరులోని సిఎస్‌పురం రోడ్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగసాని హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ పామూరు పట్టణానికి గ్రామాల నుండి అధికంగా ప్రజలు వస్తున్నారని వారి దాహార్తిని తీర్చేందుకు అన్ని సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రామిరెడ్డి, భాస్కరరెడ్డి, షేక్ నాయాబా, గోవిందయ్య పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కనిగిరి

ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి కేశవరావు, నాయకులు ఆర్ఐ మాధవరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. కనిగిరి పట్టణంలోని 894 సర్వేనెంలోగల 8-50సెంట్లు వాగు పోరంబోకు భూమిని బలసాని పోలయ్య, బెంజిమెన్‌లు ఆక్రమించుకొని వెంచర్లువేసి విక్రయాలు జరిపినట్లు తెలిపారు. రెండు ప్లాట్లలో వారు ఇంటి నిర్మాణం చేపట్టారని, ప్రభుత్వ భూమిని దురాక్రమణచేసి అమ్ముకుంటున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు వాగుపోరంబోకు భూమి ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు ఇచ్చే అధికారం రెవిన్యూవారికి లేదని, మున్సిపల్ అధికారులకు మాత్రమే ఉందని, వారిని సంప్రదించాలని ఆర్ఐ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులకు తెలియజేశారు. కార్యక్రమంలో యు.పిచ్చయ్య, ఎస్‌కె.ఖాదర్‌వలి, బషీరా, ప్రపన్న, ఏడుకొండలు, నారాయణమ్మ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

అలరిస్తున్న నాటిక పోటీలు

ప్రజాశక్తి-దరిశి

దరిశినాపురి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే పోటీలలో రెండోరోజు శనివారం మూడు నాటికలు అందరినీ అలరించాయి. హైదరాబాద్ వారి థిక్ నాటిక, గుంటూరు వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక, కొప్పోలు వారి పక్కింటి మొగుడు హాస్యనాటిక ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దరిశినాపురి నాటక కళాపరిషత్ అధ్యక్షులు కలవకొలను అనంత్ అధ్యక్షత వహించగా కార్యదర్శి అంబటి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు రంగారావు, వెంకటరెడ్డి, శేషగిరి, చంద్రశేఖర్, శివప్రసాద్, ఝాన్సీ, కోటిరెడ్డి, తనూజ పాల్గొన్నారు.

కంటి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మానస

నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మద్దిపాడు

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ అద్దేపల్లి వెంకటసుబ్బరాజు జ్ఞాపకార్థం వెల్లంపల్లిలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఒంగోలులోని సర్వనేత్రాలయ రెటీనా, కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. రెటీనా, కంటి వైద్యనిపుణులు డాక్టర్ మానస పెనుమెచ్చ పేషెంట్లను పరీక్షించారు. మొత్తం 150 మందికి వైద్యసేవలందించారు. 30 శాతం రాయితీతో కంటి శుక్లాల ఆపరేషన్లు, కళ్లజోళ్లు అందజేస్తామని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు అద్దేపల్లి శేషంరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: కుందురు

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్రంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని మార్కాపురం శాసనసభ్యులు కుందూరు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెం గ్రామంలో ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. పొదిలి చెరువుల అభివద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేశామని, వాటి ద్వారా సాగర్ కాలువకు నీటిని మళ్లిస్తామన్నారు. దీని ద్వారా భూగర్భజలాలు సాగర్ నీటితో మమేకమై ఫ్లోరైడ్ నివారణకు దోహదపడుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివద్ధి చేస్తున్న జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, వైసీపీ మండల నగర పంచాయతీ అధ్యక్షులు హనీమూన్ శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యార్థులకు సెలవులు కావడంతో పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చెరువులు, కాలువల్లోకి ఈతకు పంపించవద్దని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. నిరంతరం పుస్తక పఠనం ద్వారానే పరిపూర్ణ జ్ఞానం సంపాదించుకోవచ్చున్నారు.

58 పొగాకు బేళ్లు తిరుగుముఖం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం నాడు ఇంటికి తిరుగుముఖం పట్టిన పొగాకు బేళ్లు 58 ఉన్నాయని వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 997 బేళ్లు అమ్మకానికి ఉంచారు. అందులో 939 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 58 పొగాకు బేళ్లు ఇంటికి తిరుగుముఖం పట్టాయి. గరిష్ఠ ధర రూ.200, కనిష్ఠ ధర రూ.150, సరాసరి ధర రూ.198.83 పలికిందన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-అద్దంకి

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన 133 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది. పట్టణంలోని వాసవి నగర్, శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రకేసరి జాతీయ పరిషత్ ప్రధాన కార్యదర్శి బైరపునేని సూర్యనారాయణ ప్రసంగించారు. ఆంధ్రకేసరి జాతీయ పరిషత్ ఈ సంవత్సరం నుంచి ఇస్తున్న జీవిత సాఫల్య పురస్కారాన్ని విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రావినూతల శ్రీరాములుకు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) కందుల నాగిరెడ్డి, కాకాని రాధాకృష్ణమూర్తి, పాలపర్తి జ్యోతిష్మతి, అద్దంకి లేవిప్రసాద్, ఉబ్బా దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పమిడిగంటం చంద్రశేఖర్, నాగసూరి సుబ్బారావు, రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ వూటుకూరి రామకోటేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రకాశం పంతులు మునిమనవడు కొండపి మురళి, అలాగే ముని మనవరాలు సుభాషిణి పిల్లలను ఉద్దేశించి ప్రసంగాలను పంపించారు. ప్రకాశం పంతులు పట్టుదల, త్యాగనిరతిని విద్యార్థులు అలవరచుకోవడం ద్వారా వారు ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిలషించారు. వూటుకూరి కృష్ణ సుభాన్, రావూరి రంగయ్య సౌజన్యంతో 21 మంది విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం జరిగింది. ముందుగా బంగ్లా రోడ్‌లోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 2011 నుంచి విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించడానికి ప్రకాశం మిత్ర మండలి పాటుపడుతున్నది. ఈ సభకు అధ్యక్షులు ఇలపావులూరి శేషతల్ప సాయి అధ్యక్షత వహించారు. సభా నిర్వహణ గాడేపల్లి దివాకర్ దత్, జ్యోతిష్మతి, మరియు వూటుకూరి రామకోటేశ్వరరావు, షేక్ మహమ్మద్ రఫీ సహకారం అందించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థినులు

సినీ సాహిత్యానికి వన్నెతెచ్చిన 'సిరివెన్నెల'

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు సినీ సాహిత్యంలో వెండితెరకు మరిన్ని వెలుగులు నింపి పున్నమి వెన్నెలలు కురిపించిన సిరివెన్నెల సీతారామశాస్త్రి తెలుగు సినీ సాహితీ లోకంలో చిరస్మరణీయులని సాహితీ భారతీ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. శనివారం తెలుగు సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి 68వ జయంతి సందర్భంగా సాహితీ భారతీయ ఆధ్వర్యంలో సిరివెన్నెల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వర్మ మాట్లాడుతూ 8 వందల సినిమాలలో 3వేల పైచిలుకు పాటలు రచించి సినీ సాహిత్యానికి నూతన సొగసులద్దారన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ అశ్లీలత, అసభ్యత, ద్వంద్వార్థాలకు ఏమాత్రం తావివ్వకుండా సీతారామశాస్త్రి సాహిత్యాన్ని సుతారంగా సృజించారన్నారు. 11 నంది అవార్డులు, 4 ఫిలింఫేర్ అవార్డులతో పాటు పద్మశ్రీ అవార్డు సిరివెన్నెలను వరించాయన్నారు. కార్యక్రమంలో ఎం జాకబ్, ఎన్ కృష్ణ, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళి, రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిరివెన్నెలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

ప్రకాశం జిల్లాలో టంగుటూరి ప్రకాశం జన్మభూమి వినోద రాయుని పాలెంలో ప్రకాశం వర్ధంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ వర్ధంతి నుంచి రాష్ట్ర స్థాయిలో సాహిత్య, సామాజిక, సేవా, ప్రజాసేవ రంగాలలో లబ్ధప్రతిష్టులైన వ్యక్తులకూ ప్రకాశం జీవన సాఫల్య పురస్కారం అందించారు. ప్రకాశం విశ్వవిద్యాలయం కులపతి ఎం అంజిరెడ్డి, యునివర్సిటీ రిజిష్టర్ హరిబాబు, ఆంధ్రకేసరి జాతీయ సంఘం ప్రధాన కార్యదర్శి బైరపునేని సూర్య నారాయణ, గ్రామ సర్పంచ్ అశోక్ ముఖ్య అతిథులుగా ఈ పురస్కార ప్రదానోత్సవం జాతీయ స్థాయిలో ఈ సంవత్సరం మొట్ట మొదటిసారిగా ప్రారంభించినట్లు తెలిపారు. అద్దంకిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, సాహిత్య సేవాసంస్థలు, సాంస్కృతిక సేవాసంస్థలు చంద్రమౌళి మాస్టర్‌కి అభినందనలు తెలిపాయి. రిటైర్డ్ ఆర్‌జేడి యు దేవపాలన, చెన్నుపాటి రామాంజనేయులు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, తాళ్ళూరి బాబురావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోత రమేశ్, మాదాల దానయ్య, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి, దివాకర్ దత్తు, లెవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి చంద్రమౌళికి ప్రకాశం జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్న దృశ్యం

కరెంట్ కోతలు..ఛార్జీల బాదుడు..

టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రాష్ట్రంలో మునుపెన్నడు లేని కనీవిని ఎరుగని కొత్తకొత్త పేర్లతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలపై కోట్లాది రూపాయల విద్యుత్ భారాలు మోపుతున్నారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు వైసీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ఏడుసార్లు దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. ట్రూఅప్ ఛార్జ్, అడిషనల్ పవర్ కన్జ్వాషన్ డిపాజిట్, టీవోడీ (టైమ్ ఆఫ్ ది డే) పేరుతో విద్యుత్ చార్జీలను పెంచుతూ ప్రజల వద్ద నుంచి రూ.57 వేల 188 కోట్లు అదనంగా విద్యుత్ చార్జీలను వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014 రాష్ట్ర విభజన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పవర్ కెపాసిటీ 9,529 మెగావాట్లు ఉండగా దానిని 19,080 మెగావాట్ల ఉత్పాదనను పెంచారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కమిషన్ల కక్కుర్తితో 2020 ఫిబ్రవరిలో రూ.1,300 కోట్లు, మే నెలలో రూ.1,500 కోట్లు, 2021లో రూ.3,542 కోట్లు, ట్రూ అప్ చార్జీలు రూ.3,669 కోట్లు, టారీఫ్ సర్దుబాటు పేరుతో రూ.430 కోట్లు ప్రజలపై విద్యుత్ భారాలు మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఇతర రాష్ట్రాలకు అమ్మే స్థాయికి ఎదిగామన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఒక్క యూనిట్ అదనపు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచకపోగా రాష్ట్రంలో కరెంట్ కోతలు బాగా పెరిగాయని పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించారని ఏలూరి ఎద్దేవా చేశారు. సేవలు నామమాత్రమైనప్పుడు ఛార్జీలు పెంచడం ఈ ప్రభుత్వ అసమర్థత, అవినీతి కాదా? అని ప్రశ్నించారు. దేశంలోనే మొదటిగా, ఆసియాలోనే అతిపెద్ద అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్లాంట్‌ను కర్నూలులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్థాపించారన్నారు. వైసీపీ పాలనలో ఇప్పుడు టీవోడీ పేరుతో ప్రతి నెలా యూనిట్ రేటుపై రూ.80 పైసలు నుంచి రూ.1.20 వరకు పెంచనున్నారని చెప్పారు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ రూ.50 నుంచి రూ.60 వేలు ధర ఉంటే కడపకు చెందిన ఎంపీ అవినాష్‌రెడ్డి కంపెనీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ దగ్గర రూ.1.30 లక్షలు వెచ్చించి ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసి ప్రజల సొమ్మును దిగమింగుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కరెంటు కోతల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోతలు లేని కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువుల ధరలతో ఒకవైపు, అదనపు చార్జీలతో మరోవైపు సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. చార్జీలతో విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపైన, ఒప్పందాలపైన విచారణ సంఘం ఏర్పాటు చేయాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, అవినీతి కోసం పెడుతున్న మోటార్లకు మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఇళ్లు ఇవ్వటం ....

చంద్రబాబుకు ఇష్టం లేదు

వైసీపీ పర్చూరు ఇన్‌ఛార్జి ఆమంచి

ప్రజాశక్తి-పర్చూరు

అమరావతిలో పేదలు ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదని, ప్రభుత్వం ఇచ్చే సెంటు స్థలం శవం పూడ్చటానికి కూడా సరిపోదు అన్న చంద్రబాబు వ్యాఖ్యలపై వైసీపీ పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ నిప్పులు చెరిగారు. శనివారం పర్చూరులో పార్టీ కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు జరిగిన నిరసన ర్యాలీలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిలో పేదలు ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. పేదలంటే ఆయనకు ఎందుకంత వ్యతిరేకత అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో 50 వేల ఇళ్ల ఇస్తుంటే రాజధాని ప్రాంతం ఎందుకు అభివృద్ధి కాదని ఆయన సూటిగా ప్రశ్నించారు. శుభమాఅని నూతన గృహాలు ఇస్తుంటే వాటిని శవాలతో పోల్చటం చంద్రబాబు వికృత చేష్టలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఎంపిపి మేకా ఆనందకుమారి, మాజీ ఎంపిపి కోట హరిబాబు, కారంచేడు జడ్పీటిసి యార్లగడ్డ రజని, కారంచేడు ఎంపిపి నీరుకట్టు వాసుబాబు, పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకర్, తోకట కృష్ణమోహన్, అనీల్, గడ్డం మస్తాన్‌వలి, అనీల్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఆమంచి కృష్ణమోహన్

ముగిసిన ఎపి లాసెట్ పరీక్షలు

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో ఎపి లాసెట్-2023 పరీక్షలు 20-05-2023 శనివారం నాడు కళాశాల టిసిఎస్ బయాన్ సెంటర్‌లో నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

లెప్రసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేటపాలెం

మండలం పరిధిలోని రామన్నపేట పంచాయతీ కనక నాగవరపు అమ్మవారి దేవస్థానానికి వెళ్లే దారిలో ఉన్న లెప్రసీ కాలనీలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాలనీలోని పలువురు నిరుపేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా 110 మందికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎఎంసి చైర్మన్ మార్పు గ్రేగోరీ, రెవరెండ్ ఫాదర్ టీ కరుణాకర్, రెవరెండ్ ఫాదర్ మార్పు నరేష్, వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య శాఖ డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ విజయ్, డిపిఎంఓ పి వెంకటేశ్వరావు, సిహెచ్‌ఓ గురువమ్మా, ఎంపిఎఈఓ సిహెచ్ శేషుబాబు, డిపిఎంఓ సరంగా పని, బండ్లబాబు, అచ్చంశెట్టి భానుమూర్తి, విన్సెంట్ పాల్ పాల్గొన్నారు.

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని సింగరకొండపాలెం ఎస్టీ కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కష్టజీవులు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసిఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేర్ అండ్ క్యూర్ వారి సహకారంతో వడదెబ్బ తగలకుండా హెూమియో మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, సింగరకొండపాలెం ఎస్సీ కాలనీ ప్రజానికం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బస్‌షెల్టర్‌లో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-వేటపాలెం

సమాజ సేవా రంగంలో పట్టభద్రుల సంఘం ముందంజలో ఉంటుందని అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో వేటపాలెం గ్రామం రావూరు రోడ్డులోని ప్రత్తి మల్లికార్జునరావు, వెంకటసుబ్బమ్మ బస్సు షెల్టర్‌లో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వేసవి కాలం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రావూరు, తిమ్మసముద్రం, చీరాల ప్రయాణం చేసే ప్రయాణికుల, గ్రామ ప్రజల సౌకర్యార్థం తాగునీరు ఏర్పాటు చేశారు. విజయవాడ వాస్తవ్యులు, ప్రముఖ సామాజిక సేవకులు వంగర వెంకట్రావు మాట్లాడుతూ మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయడం, పట్టభద్రులుగా సమాజ సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, కోశాధికారి సజ్జా శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షులు బుర్ర సాంబశివరావు, ఫౌండర్ మెంబర్ గుడిమూటి శేఖర్, రావి మస్తాన్‌రెడ్డి, ప్రత్తి శరత్ బాబు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు

సబ్సిడీ రుణాలివ్వాలి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం ఎస్‌హెచ్‌జి మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇచ్చే విషయమై బ్యాంకర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కన్వర్జెన్స్ మీటింగ్ జరిగింది. సమావేశంలో సెర్ప్, డిఆర్‌డిఏ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే యూనిట్స్ గ్రౌండింగ్ విషయాలపై చర్చించి లక్ష్యాలను నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.2 నుంచి రూ.10 లక్షల వరకు 1900 యూనిట్లను ప్రతి మండలం నుంచి 50 ఏర్పాటు చేసి.. వీటికి పిఎంఈజిపి పిఎంఎఫ్ఎంఇ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు. చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఏ పీడీ బి.బాబురావు, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు, డిఆర్‌డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాకు 'పేస్' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 48 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ టిసిఎస్ సంస్థ చే నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో పేస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జీవికే మూర్తి, ప్లేస్ మెంట్స్ ట్రైనింగ్ డీన్ కె రూప, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆర్ వీరాంజనేయులు, కళాశాల హెచ్‌ఓడీ లు, అధ్యాపక సిబ్బంది ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

చిత్రలేఖనం అద్భుతమైన ప్రక్రియ

ప్రజాశక్తి-కనిగిరి

విద్యార్థులలో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాన్ని వెలికితీసే ప్రక్రియలో చిత్రలేఖనం ఒక అద్భుతమైన ప్రక్రియ అని ఎంఎస్ఆర్ బాలికల కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి తెలియజేశారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిత్రలేఖనంలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్, ఫణీంద్ర కుమార్, రాజేష్, రుక్మిణి పాల్గొన్నారు.

గిరిజన గూడెంలో స్పెషల్ ఆధార్ డ్రైవ్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి పంచాయితీ పరిధిలో గల శాంతి నగర్ గిరిజన గూడెంలో షార్ప్స్ సంస్థ చిల్డ్రన్ బిలీవ్ సహాయ సహకారాలతో శనివారం గంజివారిపల్లి పంచాయతీ సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ ఆధార్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా శాంతినగర్, గాంధీ నగర్, దద్దణాల, చెన్నుపల్లి గిరిజన గూడేల్లో ఉన్న చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్‌లు ఎన్‌రోల్ చేశారు. ఆధార్ కార్డులు ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనుండటంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు షార్ప్స్ సంస్థ ఏఎస్ఎస్‌వో మందా మరియబాబు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సర్పంచ్ సుబ్బారెడ్డి సహకారం అందించారు.

'టంగుటూరి'ని ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ - ప్రకాశం పంతులుకు ఘన నివాళులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టంగుటూరి ప్రకాశం పంతులు పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ప్రకాశం భవనంలో ఉన్న విగ్రహానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధునిగా ప్రకాశం పంతులు చూపిన తెగువ, పరిపాలనాదక్షునిగా ఆయన ప్రతిభ, విశేషాలను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకాశం పంతులు స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాలలో ముందుకు నడిపిస్తామని కలెక్టర్ తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు లాయర్ పేటలో ప్రకాశం పంతులు కాంస్య విగ్రహం ఉన్న ప్రాంతానికి "ప్రకాశం పంతులు సెంటర్ "గా పేరు పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడ ఉన్న రోడ్డుకు కూడా ప్రకాశం పంతులు రోడ్డుగా నామకరణం

నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బాలినేని

చేస్తూ ప్రత్యేక ఆర్చి నిర్మిస్తామని ప్రకటించారు కార్యక్రమంలో ఎఎస్‌పి నాగేశ్వరరావు, మేదర కార్పొరేషన్ చైర్మన్ లలితా నాంచారమ్మ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ బాషా, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం గ్రామంలో శనివారం పర్యటించిన మంత్రి సురేష్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీలోని ఒక మహిళ తాను కట్టుకున్న ఇల్లు వర్షాలకు కూలిపోయిందని, ఇప్పుడు నిలువ నీడ లేకుండా పోయిందని మంత్రి సురేష్ ముందు వాపోవడంతో అక్కడికక్కడే పదివేల రూపాయలు ఆర్థిక సాయంగా అందించారు. మరొక వ్యక్తి గత ఇరవై ఏళ్లుగా ఇల్లు మంజూరు కాకపోవడంతో తాను సొంతంగా కట్టుకుంటున్నానని చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులను పిలిచి రెండు రోజుల్లో ఇంటికి బిల్లులు పెట్టే

గడపగడపకూ.. కార్యక్రమంలో మంత్రి సురేష్

విధంగా చేయాలని ఆదేశించారు. అనంతరం ఆ గ్రామంలో ఎస్సి కాలనీలోని ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను తీర్చాలని లక్ష్యంతో వైసిపి నాయకులు, ఏపి ఫిల్మ్ చాంబర్ డైరెక్టర్ జినుకూటి జాన్ బాబు రెండు లక్షల రూపాయల తన సొంత నిధులతో నిర్మించిన బోరును మంత్రి సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ కోట పిచ్చయ్య, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, మండల తహశీల్దార్ కె కిరణ్, ఎంపిడిఓ ఎం మరియదాసు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, వైస్ కన్వీనర్ ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

వికలాంగుల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన మూడు చక్రాల మోటారు వాహనాలను వికలాంగులు వినియోగించుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఒంగోలు ఎంపిడిఒ కార్యాలయంలో వికలాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో నివారం ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన 10 మంది వికలాంగులకు 12 లక్షల విలువైన మూడు చక్రాల మోటార్ వాహనాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వారిని సకలాంగులతో సమానంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుటుందన్నారు. వికలాంగులకు సెల్‌ఫోన్లు,

మోటారుసైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బాలినేని

ల్యాప్‌ట్యాప్‌లు గతంలో పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం అందజేసిన మూడు చక్రాల మోటార్ వాహనాలను వికలాంగులు వినియోగించుకోవాలని కోరారు. వికలాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ జి.అర్చన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మహిళ, ఎస్సీ, ఎస్టీ, ఎడ్యుకేషన్ ల ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఒక్కొక్క వాహనం విలువ లక్షా ఇరవై వేల రూపాయలు చొప్పున మొత్తం రూ.12 లక్షలు విలువైన వాహనాలను పంపిణీ చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఒంగోలు మేయర్ వేమూరి సూర్యనారాయణ, , ఒంగోలు ఎంపిపి పాటు పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

వసతుల్లేని 'ఉపాధి'

బాపట్ల జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలీలకు 73 లక్షల పనిదినాలు కల్పించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ఈ మేరకు మండలాలు, గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులను నిర్ధేశించారు. ప్రధానంగా పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, ఇంకుడు గుంటలు, పండ్ల తోటల ఉపాధి పనులు చేపట్టారు. గత రెండు వారాలుగా జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు ఆ ఎండల్లోనే పనులు చేపడుతున్నారు. ఉపాధిహామీ పని ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. చట్టం ప్రకారం వేసవిలో ఉపాధి కూలీలకు పని చేసే చోట కనీస వసతులు కల్పించాలి. ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఎండలో పనులు చేసేవారు కాసేపు సేద తీరడానికి టెంట్లు లేకుండా పోయాయి. కూలీలకు మజ్జిగ, మంచినీరు అందించాలి. కానీ ఇవేవీ లేవు. ఉపాధి కూలీలకు అనారోగ్య సమస్యలు తలెత్తినా, వడదెబ్బ తగిలినా ఉపయోగించడానికి అధికారులు మెడికల్ కిట్లు ఇవ్వాలి. అవి పని ప్రదేశంలో ఉండడం లేదు. కనీసం మంచి నీరు ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు ఇంటి నుంచే బాటిళ్లతో నీరు తీసుకెళ్తున్నారు. తమ గ్రామాలకు దూరంగా పనులకు వస్తున్న ఉపాధి కూలీలకు తాము తెచ్చుకున్న నీరు అయిపోతే తాగునీరు దొరికే పరిస్థితి లేదు. ఈ కారణంగా ఎక్కువ సమయం పని చేసే పరిస్థితి ఉండటం లేదు. తగిన కొలతలు రాని కారణంగా కనీసం వేతనం రూ.272 కాగా రూ.230 మించి వేతనం రావడం లేదు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ బాపట్ల జిల్లా, నిజాంపట్నంలో పర్యటించారు. సముద్రంలో వేట లేని సమయంలో ఏటా మత్స్యకారులకు ఇస్తున్న సాయాన్ని సభలో విడుదల చేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,23,519 మంది మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద రూ.123.52 కోట్లను నేరుగా మత్స్యకారుల ఖాతాలో వేశారు. నిజాంపట్నం పరిధి దిండి గ్రామం వద్ద నాణ్యమైన ఫీడ్, సీడ్ అందించడమే లక్ష్యంగా 280 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఆక్వా పార్కుకు శంకుస్థాపన చేశారు. సీడ్ మేకింగ్ యూనిట్ ద్వారా 21వేల మందికి ఉపాధి కలుగుతుందని చెబుతున్నారు. దీంతో పాటు చీరాల వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. మత్స్య, ఆక్వా రంగాలకు మంచి జరిగేలా ఈ రంగంలో నిపుణులను తయారుచేసే విధంగా ఫిషరీస్ యూనివర్సిటీ పశ్చిమ గోదావరిలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సభలో 50 నిమిషాలు ప్రసంగించిన సిఎం అందులో అరగంటకు పైగా ప్రతిపక్షాలు, మీడియా పై విమర్శలకు ప్రాధాన్యతనిచ్చారు. మత్స్యకార భరోసా నిధులను విడుదల చేస్తూ సిఎం నాలుగు రోజుల క్రితం బటన్ నొక్కినప్పటికీ నేటికి పలువురు మత్స్యకారుల ఖాతాలను జమకాలేదు.

రాష్ట్రప్రభుత్వం ఏటా చేస్తున్నట్లుగానే మంచి సేవలు అందించిన వాలంటీర్లకు సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సన్మానాలు చేపట్టారు. బాపట్ల జిల్లాలో 7,511 మందికి సేవామిత్ర పురస్కారాలతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.7.51 కోట్లు నగదును బహుమతిగా ఇచ్చారు. 145 మందికి సేవారత్న పురస్కారాలు, రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.29 లక్షలు, జిల్లావ్యాప్తంగా 30 మందికి సేవావజ్ర పురస్కారాలతో పాటు రూ.30 వేలు చొప్పున రూ.9 లక్షల నగదును అందజేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 7,686 మందికి ఈపురస్కారాలు దక్కాయి.ఉన్నతమైన ప్రమాణాలు పాటిస్తూ సేవల్లో మంచిపేరు సంపాదించుకోవాలని అధికారులు కోరారు.

నిషేధిత భూముల జాబితా నుంచి వందేళ్ల తర్వాత వందల మంది రైతుల భూములకు శాశ్వతంగా విముక్తి కలిగింది. చుక్కల భూముల రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ జరిగింది. బాపట్ల జిల్లాలో 3,514 సర్వే నెంబర్లలోని 7,833.87 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించారు. జిల్లాలో 4,257 రైతు కుటుంబాలు దీని ద్వారా లబ్ధి పొందాయి. బ్రిటిష్ కాలం నుంచి చుక్కల భూమి ఎవరిదో స్పష్టత లేదు. ప్రభుత్వానికి చెందినవా, ప్రైవేట్ వ్యక్తుల భూములా అనే విషయంలో సందిగ్ధత ఉండేది. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై దృష్టి పెట్టిన ప్రభుత్వం నిషేధిత భూముల జాబితా నుంచి చుక్కల భూములను విడుదల చేయడంతో రైతుల సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభించింది.

జగనన్న కాలనీలలో పక్కా గహాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. అధికారులు లబ్ధిదారులను ఎంతగా ప్రోత్సహిస్తున్న నిర్మాణాలు జరగడం లేదు. బాపట్ల జిల్లాలో నేటికీ 12 వేల పక్కా గహాలు పునాది స్థాయిలోనే ఉన్నాయి. నిర్మాణ సామాగ్రి ధరలు పెరగడం,నీటి సమస్య,కాలనీల్లో కనీస వసతుల కల్పన లేకపోవడం, లబ్ధిదారుల ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉండడంతో పక్కాగృహాల నిర్మాణాల పనులు అరకొరగా సాగుతున్నాయి.అలానే ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు కూడా సంవత్సర కాలంగా బిల్లులు విడుదల కానందున నిలచిపోయాయి. నాడు-నేడు పనులకు సంబంధించి రూ.13 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు కాని పనులు వేగంగా జరగడంలేదు. నిధుల కొరత లేనందున విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి లక్ష్యం మేరకు పాఠశాల నిర్మాణాల పనులు పూర్తి చేయాల్సి ఉంది. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులు కూడా నత్తనడకన జరుగుతున్నాయి.బిల్లులు మంజూరుల్లో విపరీత జాప్యం కారణంగా పనులు చేపట్టిన నేతలు ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా